ఫీజు బకాయిలు విడుదల చేయాలని కలెక్టరేట్ ముట్టడి

శెనార్తి మీడియా, కరీంనగర్

బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లెంకల అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ కలెక్టరేట్‌ను విద్యార్థులు ముట్టడించారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లు, మండల ఎమ్మార్వో కార్యాలయాలు, ఆర్డీవో కార్యాలయాల వద్ద ముట్టడులు చేపట్టారు. ఈ సందర్భంగా లెంకల అనిల్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా బీసీ సంక్షేమం పట్ల నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తోందని మండిపడ్డారు. ఇప్పటికీ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల రూపంలో సుమారు ఎనిమిది వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే ఈ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజులు చెల్లించకపోతే కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని ఆయన విమర్శించారు. పై చదువులు కొనసాగించాలన్నా, ఉద్యోగాల్లో చేరాలన్నా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్ బకాయిలను విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల కార్యాలయాలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ముట్టడిలో దుబ్బాసి ప్రణీత్, అజయ్ సాయి యాదవ్, రిషి యాదవ్, శ్రీకాంత్, తిరుమలేష్, సుకుమార్, తిరుపతి, రఘు, దేవేందర్, రాజేష్, మహేష్, సిద్దు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. దాదాపు వెయ్యి మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగమయ్యారు.

బొమ్మకల్ సిటిజన్ కాలనీలో

నీటి సమస్య పరిష్కరించాలి

శెనార్తి మీడియా, కరీంనగర్:

కరీంనగర్ నగరంలోని బొమ్మకల్ సిటిజన్ కాలనీలో త్రాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా బొమ్మకల్ ప్రాంతంలో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను సందర్శించి పరిశీలించారు. అనంతరం హౌసింగ్ బోర్డులో పర్యటించి, కొత్తగా సానిటేషన్ వాహనాల కోసం షెడ్డు నిర్మాణం చేపట్టే ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్ అధికారులకు అవసరమైన సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ, బొమ్మకల్ ప్రాంతంలో త్రాగునీటి సరఫరా సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా జరుగుతున్న నీటి పంపిణీ తీరుపై సమీక్ష జరిపి, సమయానికి ప్రజలకు నీరు అందేలా చూడాలని ఆదేశించారు. అలాగే సానిటేషన్ వాహనాల కోసం నూతనంగా షెడ్డు నిర్మాణం చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ లచ్చిరెడ్డి, దేవేందర్, వెంకటేశ్వర్లు, ఏసిపి వేణు, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

వికసిత భారత్–2047 పుస్తకావిష్కరణ

శెనార్తి మీడియా, కరీంనగర్ :

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ రూపొందించిన వికసిత భారత్–2047 పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బుధవారం కలెక్టరేట్ ఛాంబర్లో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమాన్ని మేరా యువభారత్ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. యువజనుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వాటి కోసం దరఖాస్తు విధానం తదితర వివరాలను ఈ పుస్తకంలో పొందు పరిచినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా యువజన అధికారి రాంబాబు, బీసీ వెల్ఫేర్ అధికారి అనిల్ ప్రకాష్, ఏవో సుధాకర్, అకౌంటెంట్ రవీందర్ పాల్గొన్నారు

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

శెనార్తి మీడియా, కరీంనగర్:

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నివాళులర్పించారు. డీసీసీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఇతర నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద జరిగిన కార్యక్రమంలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మాచర్ల ప్రసాద్ తదితరులు రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఆర్థిక సంస్కరణలు, గ్రామపంచాయతీలకు నిధుల కేటాయింపు, యువతకు ఓటు హక్కు కల్పన వంటి చారిత్రక నిర్ణయాలు తీసుకున్నారని, సాంకేతిక విప్లవ యోధునిగా ఐటీ, టెలికాం రంగాలను బలోపేతం చేసి దేశాన్ని ప్రపంచ దేశాలతో సమానంగా నిలిపారని కొనియాడారు. ఎండీ తాజుద్దీన్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్ నాయక్, కృపా సాగర్, నిహాల్ అహ్మద్, కంకణాల అనిల్‌కుమార్, కుర్ర పోషయ్య, వంగల విద్యాసాగర్, దన్నసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కేశవపట్నంలో

శెనార్తి మీడియా, శంకరపట్నం: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బసవయ్య గౌడ్ ఆధ్వర్యంలో కేశవపట్నంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్, నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హుజురాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, బండారి తిరుపతి, కొత్తగట్టు మత్స్య గిరీంద్ర ఆలయ మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రెడ్డి పవన్, తుమ్మేటి రాజిరెడ్డి, తాటికొండ సదానందా చారి, సదానందం ఇస్తాముద్దీన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు

శెనార్తి మీడియా, కరీంనగర్:

చిగురుమామిడి మండలంలోని రైతులకు యూరియా బస్తాలు సకాలంలో అందించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఆరోపిస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల సమితి ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ముందు రైతులు నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి జైపాల్ రెడ్డి, గోలి చంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మండలంలో యూరియా కొరత ఏర్పడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నియోజకవర్గంలోనే ఇలాంటి సమస్యలు ఉండటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లేకపోవడమే ఈ సమస్యకు కారణమని వారు విమర్శించారు. రైతులు ప్రతిరోజూ ప్రాథమిక సహకార కేంద్రం వద్ద బారులు తీరుతూ గంటల తరబడి నిల్చున్నా మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని వాపోయారు. పట్టాదారు పాసు బుక్కు, ఆధార్ కార్డు ఉన్న వారికి మాత్రమే యూరియా ఇస్తుండటం దుర్మార్గమని, యూరియాతోపాటు నాన్ లిక్విడ్ కొనాలని బలవంతం చేయడం రైతులకు భారం పెడుతోందని వారు ఆరోపించారు. కృత్రిమ కొరత సృష్టించి యూరియాను బయట విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని దీనికి అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తక్షణమే చిగురుమామిడి మండలంలో సరిపడ యూరియా బస్తాలను తెప్పించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముద్రకోల రాజయ్య, మనోజ్, మహేందర్, రెడ్డి, ఐలయ్య, గంగారెడ్డి, మల్లారెడ్డి, రామస్వామి, పోచయ్య, స్వామి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.4314.88 కోట్ల రుణాలు మంజూరు

- **పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సహకారం అందించాలి**
- **జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

శెనార్తి మీడియా, కరీంనగర్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనకు బ్యాంకర్లు సమన్వయంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో కలిసి డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు రుణాల పంపిణీ, స్వయం సహాయక సంఘాల రుణాలు, రికవరీ, పీఎం–జిపివై రుణాలు, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల పథకాల లక్ష్య పురోగతి వంటి అంశాలపై ఈ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వంద శాతం లక్ష్య సాధనకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రైతులు తమ రుణాలను రిన్యువల్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, వ్యవసాయ శాఖతో కలిసి ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని బ్యాంకర్లను ఆదేశించారు.

రూ.4314.88 కోట్ల రుణాలు మంజూరు

2025–26 ఆర్థిక సంవత్సరం (2024 ఏప్రిల్ నుండి 2025 జూన్ వరకు)లో జిల్లాలో రూ.4314.88 కోట్ల రుణాలు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ.1591.41 కోట్లు, ఎంఎ స్ఎంఈలకు రూ.1186.38 కోట్లు, విద్యా రుణాలకు రూ.3.38 కోట్లు, గృహ నిర్మాణ రుణాలకు రూ.57.24 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు రూ.258 కోట్లు, ఇతర రంగాలకు రూ.1218.47 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. అర్హులైన రైతులందరికీ రుణాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జూన్ 30 వరకు కేవలం 32.12 శాతం లక్ష్య సాధన జరిగిందని, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలను త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

శెనార్తి మీడియా, కరీంనగర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన ప్రధాన దవాఖాన, కలెక్టరేట్ ఆవరణను పరిశీలించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వీరారెడ్డి, వైద్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో కలిసి ఆసుపత్రి ఆవరణలో పర్యటించిన కమిషనర్, పరిశుభ్రతపై సమీక్ష చేసి లోపాలను గుర్తించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఆడిటోరియంను సందర్శించి పరిశీలించారు. అక్కడి పరిశుభ్రత స్థితిగతులపై కూడా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రజలు అధికంగా వచ్చే ప్రభుత్వ ఆసుపత్రి, కలెక్టరేట్ ఆవరణల్లో ఎలాంటి చెత్త కనిపించకుండా పారిశుధ్య పనులు పకడ్బందీగా కొనసాగించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, పారిశుధ్య అధికారులు పాల్గొన్నారు.

స్వీట్‌షాపులపై అధికారులు దాడులు

శెనార్తి మీడియా, కరీంనగర్:

కరీంనగర్‌లో స్వీట్లు కొనుగోలు చేసే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. బుధవారం జిల్లాలోని మూడు స్వీట్‌షాపులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో భయంకరమైన లోపాలు వెలుగులోకి వచ్చాయి. స్వీట్లపై బల్లుల మలం, పాలలో ఈగలు, దోమలు ఉన్నట్లు గుర్తించారు. తయారీ కిచెన్లు పరిశుభ్రంగా లేకపోవడంతో దుర్వాసన వస్తుందని అధికారులు తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురికితో నిండిపోయిన పరిస్థితి ఉన్నట్లు వెల్లడించారు. పరిమితికి మించి కృత్రిమ రంగులు వాడుతున్నారని, గడువు ముగిసిన పదార్థాలు ఉపయోగిస్తున్నారని అధికారులు తేల్చారు.

నామమాత్ర చర్యలే

కల్తీ ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులపై కేసులు నమోదు చేసినా, జరిమానాలతో సరిపెడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇదే కారణంగా వ్యాపారులు నిర్భయంగా నాణ్యతలేని వస్తువులను విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్, సివిల్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్, తినుబండారాలు, పప్పు దినుసులు, వనస్పతి, నకిలీ ఇంధనాలు, డిస్టిల్డ్ వాటర్, వాహన విడి భాగాలు, పశువుల ఔషధాలు వంటి అక్రమ దందాలు వెలుగులోకి వచ్చాయి. అయినా వ్యాపారుల ధోరణి మారడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

వ్యాధులకు దారితీసే కలుషిత ఆహారం

ప్రతి సంవత్సరం లక్షలాది మంది కలుషిత ఆహారం, నీరు వల్ల వ్యాధులకు గురవుతున్నారు. బ్యాక్టీరియా, వైరస్‌లు, రసాయన కలుషితాల కారణంగా ఆహార సంబంధిత వ్యాధులు ప్రాణాంతకమవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నగరంలో తనిఖీలు

రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశాలపై అసిస్టెంట్ ఫుడ్ కంట్రోల్ ఖలీల్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ అంకిత్‌రెడ్డి బృందం కరీంనగర్‌లోని అనిల్ స్వీట్స్ బేకరి (టవర్ సర్కిల్), ఆనంద్ స్వీట్స్ (టవర్ సర్కిల్), ★★మహారాజా స్వీట్స్ (ముకరంపుర)★★లో దాడులు జరిపింది. ఈ తనిఖీల్లో లోపాలు ఉన్న స్వీట్లు, పాలను వెంటనే పారవేసినట్లు అధికారులు తెలిపారు. ఆనంద్ స్వీట్స్‌లో 20 లీటర్ల పాలను, మహారాజా స్వీట్స్‌లో 10 కిలోల బాదుషా, మూడు కిలోల కారాలను పారవేశామని పేర్కొన్నారు. స్వీట్ల శాంపిల్స్‌ను సేకరించి పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించామని వెల్లడించారు. ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కఠిన చర్యలు తప్పనిసరని వారు స్పష్టం చేశారు.